

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి, మే 11: 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గణేశ్ కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని, ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, కోర్సులకు ఆవకాశం ఉందని తెలిపారు. బాలికలకు 100 మందికి హాస్టల్ వసతి ఉందని పేర్కొన్నారు.



ష్.. గప్‌చుప్!

» ముగిసిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారం » ఇక మంతనాలు, బుజ్జగింపులపై అభ్యర్థుల దృష్టి
» ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు చివరి ప్రయత్నాలు కొనసాగిస్తున్న అభ్యర్థులు

నిజామాబాద్, మే11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారఘట్టం ముగిసింది. అభ్యర్థులు ఎండలు సైతం లెక్కచేయకుండా అధిక ఉష్ణోగ్రతల్లో ప్రచారాలను నిర్వహించారు. ఓటర్ల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేశారు. ప్రచార గడువు ముగియడంతో ఉన్న సమయాన్ని మంతనాలు చేయడంతోపాటు ఓటర్ల మద్దతను కూడగట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఉన్న ఒక్కరోజు సమయాన్ని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అనుచరవర్గాన్ని దించడంతోపాటు భారీగా ఖర్చు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల నిబంధనలు ఉండటంతో డోర్ టూ డోర్‌కు అవకాశం ఉండటంతో బూత్‌లెవల్‌లో ఒకరు లేరా ఇద్దరిని పంపించి ప్రయత్నాలు చేస్తున్నారు. ముందస్తుగానే ఏర్పాట్లలో ఉన్న అభ్యర్థులు ప్రలోభాలపై దృష్టి పెట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.

• అభ్యర్థులకు మద్దతుగా నేతల ప్రచారం

పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ముగిసింది. నామినేషన్ల ఘట్టం గతనెల 18న మొదలుకాగా 25తో ముగిసింది. సుమారు 17రోజుల పాటు అభ్యర్థులు ప్రచారం చేశారు. ఎప్పుడూ లేనివిధంగా ఎండలు కూడా పెరగడంతో వాటిని సైతం లెక్కచేయకుండా ప్రచారాలను చేశారు. అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ పూర్తి సమయాన్ని వెచ్చించి ప్రచారాలు చేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, పార్టీ స్థానిక సంస్థల ప్రతినిధులు, సీనియర్ నేతలందరినీ ప్రచారంలోకి దించారు. తమకు అనుకూలంగా పార్టీకి చెందిన నేతలు హాజరయ్యేలా చూస్తూ బహిరంగ సభలను నిర్వహించారు. ఓటర్ల మద్దతును కూడగట్టే ప్రయత్నాలు చేశారు. పార్లమెంట్ పరిధిలో 800పైగా గ్రామాలు ఉండటం, మున్సిపాలిటీలు కూడా ఏడు ఉండటంతో ప్రధాన ప్రాంతాల్లోమాత్రమే అభ్యర్థులు పర్యటించారు. గ్రామాలకు ఎమ్మెల్యేలు, నేతలను పంపించి ప్రచారాలను చేశారు. పార్లమెంట్ ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకున్న ఆయా పార్టీ నేతలు భారీ బహిరంగ సభలకు హాజరయ్యారు. కాంగ్రెస్ తరపున సీఎం రేవంత్‌రెడ్డి 3 దఫాలు పార్లమెంట్ పరిధిలో జరిగిన బహిరంగ సభలు, రోడ్‌షోలో పాల్గొన్నారు. బీఆర్ ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా మాజీ సీఎం, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ప్రచారాల్లో పాల్గొన్నారు. జగిత్యాల, నిజామాబాద్‌లో జరిగిన రోడ్‌షోలో పాల్గొన్నారు. ఆయనతో పాటు పార్టీకి చెందిన నేతలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు ప్రచారానికి హాజరయ్యారు. బీజేపీ తరఫున ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఉత్తరఖాండ్ సీఎం పుష్కర్ సింగ్‌దామితోపాటు సీనియర్ నేతలంతా అర్వింద్‌కు మద్దతుగా ప్రచారాలను నిర్వహించారు.

• మంతనాలపై దృష్టి

ప్రచారం ముగియడం సమయం ఒక్కరోజే ఉండటంతో అభ్యర్థులందరూ మంతనాలపైన దృష్టిపెట్టారు. ముగ్గురు అభ్యర్థులు సీనియర్లే కావడంతో తమ అనుచరులను, పార్టీ నేతలను రంగంలోకి దించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ద్వారా మద్దతును కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఉన్న ఒక్కరోజును పోలింగ్ బూత్‌ల ఆధారంగా ఓటర్లతో మంతనాలు జరిపే ప్రయత్నాలను చేస్తున్నారు. కేడర్‌ను రంగంలోకి దించి ఓటర్ల మద్దతును కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో డబ్బు, మద్యాన్ని కూడా వినియోగించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఓటర్లు పోలింగ్ రోజు ఎటువైపు మొగ్గుతారో వేచిచూడాలి.

పార్లమెంట్ ఎన్నికల కోసం 1808 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

• జిల్లాలో ఓటు హక్కును వినియోగించుకోనున్న 17లక్షల 4,867 మంది ఓటర్లు • అన్నిపోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధింపు
• 14న ఉదయం వరకు మద్యం దుకాణాలు మూసివేత • పోలింగ్‌కు 3వేల మంది పోలీసులతో బందోబస్తు
• విలేకరుల సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ సింగనెవార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్


నిజామాబాద్, మే11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేశామని, జిల్లావ్యాప్తంగా 1808పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ప్రతీఓటరు 13న పోలింగ్ కేంద్రాలకు చేరుకొని స్వేచ్ఛగా ఓటు వేసేలలా వసతులు కల్పించామని, ఓటర్లు కదిలివచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టరేట్‌లో సీపీ కల్మేశ్వర్ సింగనెవార్‌తో కలిసి సంయుక్తంగా శనివారం విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎన్నికలకు కావాల్సిన మౌలిక వసతులను కల్పించామని తెలిపారు. ఈ ఎన్నికల పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరుగుతుందని తెలిపారు. పార్లమెంట్ పరిధిలో ఓటింగ్‌శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లను చేయడంతో పాటు నేడు 7అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలోని రిసెప్షన్ కేంద్రాల నుంచి పోలింగ్ సిబ్బంది సామాగ్రి తీసుకొని పోలింగ్ కేంద్రాలకు తరలుతారని తెలిపారు.

• ఓటు హక్కును వినియోగంచుకోనున్న 17లక్షల 4,867మంది ఓటర్లు

ఈ ఎన్నికల్లో మొత్తం 17లక్షల 4,867మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారని కలెక్టర్ తెలిపారు. వీరిలో పురుషులు 8లక్షల 6,130మంది, మహిళలు 8లక్షల 98,647మంది, ఇతరులు 90మంది ఉన్నారని వెల్లడించారు. వీరికోసం 7అసెంబ్లీ సెగ్మెంట్‌లో 1808 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు సీసీటీవీలతోపాటు వెబ్‌క్యాస్టింగ్‌ను ఉపయోగిస్తున్నామని చెప్పారు. పార్లమెంట్ పరిధిలోని 1347 కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్‌ను చేస్తున్నామని అన్నారు. పార్లమెంట్ పరిధిలో 1161 కేంద్రాల్లో సీసీటీవీలను కూడా పోలింగ్ కేంద్రాల బయట ఉపయోగిస్తున్నామన్నారు. 7అసెంబ్లీ సెగ్మెంట్‌లో 302మంది మైక్రో అబ్జర్‌వర్లను, 206 మంది సెక్టోరియల్ అధికారులను వినియోగిస్తున్నామని తెలిపారు. మొత్తం 4497బ్యాలెట్ యూనిట్లు, 2293 కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు 2511ను వినియోగిస్తున్నామన్నారు. లిక్కర్ షాపులను, ఐఎంఎల్ డిపోలను, కల్లుబట్టీలను 14వతేదీ ఉదయం 6గంటల వరకు మూసివేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించామని తెలిపారు. ఓటర్లు ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, లేబర్ గుర్తింపుకార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన గుర్తింపు కార్డుతో ఓటు వేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

• ఎన్నికల కోసం భారీ బందోబస్తు : సీపీ

పార్లమెంట్ పోలింగ్ సందర్భంగా ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లో భారీ బందోబస్తును ఏర్పాటు చేశామని నగర పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ తెలిపారు. అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో 144 సెక్షన్ విధించామని చెప్పారు. ఎన్నికల ప్రచారం ముగిసినందున ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో మద్యం కొనడం, ఉపయోగించడానికి అనుమతి లేదన్నారు. 3వేల మంది పోలీసులు, హోంగార్డు, కేంద్ర బలగాలను వినియోగిస్తున్నామని తెలిపారు. తనిఖీలను ఎక్కువ చేశామని 48 బృందాలు రాత్రి పగలు తనిఖీల్లోనే ఉంటాయని చెప్పారు. 91 తుపాకులను స్వాధీనం చేసుకున్నామన్నారు. బూత్‌లో ఇద్దరికి మించి ఉండరాదని, పార్టీ సింబల్‌ను వినియోగించొద్దని తెలిపారు.



చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించడంపై చిత్తశుద్ధితో ఉన్నాం

• కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, మే 11: చక్కెర కర్మాగారాలను తెరిపించే విషయంలో కాంగ్రెస్‌ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సెప్టెంబర్ 17న కేబినెట్ తీర్మానం చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. 2025 డిసెంబర్‌లో బోధన్, మెట్‌పల్లి షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ ప్రారంభిస్తామన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకగా మాట్లాడానని తెలిపారు. ఐదేళ్ల అధికార పార్టీ ఎంపీగా ఉండి అభివృద్ధిని పట్టించుకోని అర్వింద్ ఇప్పుడు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అబద్ధపు హామీలు ఇస్తున్నారని నియోజకవర్గ సమస్యలపై అర్వింద్‌కు అవగాహన, చిత్తశుద్ధిలేదని విమర్శించారు. తాను గెలిస్తే నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీతోపాటు మహిళా డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయిస్తానని, బోధన్-బీదర్ రైల్వేలైన్ కోసం కృషి చేస్తానన్నారు.

దేశ భద్రతకు ప్రాధాన్యతనిచ్చి బీజేపీకి పట్టం కట్టాలి

• రైతుల పోరాట ఫలితంగానే మోదీ పసుపు బోర్డు ప్రకటన
• ప్రజలు ఆలోచించి ఓటేయాలి: బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్


మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్

నిజామాబాద్, మే11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశ భద్రతకు ప్రాధాన్యతనిచ్చి బీజేపీకి పట్టం కట్టాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ ప్రజలను కోరారు. పసుపు బోర్డు కోసం రైతుల చేసిన పోరాటాన్ని గుర్తించే ప్రధాని మోదీ పసుపు బోర్డును ప్రకటించారని, దీన్ని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఇంకా బోర్డు రాలేదని అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీట్ ది ప్రెస్‌లో మాట్లాడారు. కేంద్రం పసుపుబోర్డు కోసం గెజిట్ ఇవ్వడంతోపాటు ప్రక్రియ మొదలు పెట్టిందని అన్నారు. కేంద్ర హోంమంత్రి కూడా నిజామాబాద్‌లోనే బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించారని తెలిపారు. ఇప్పటికే స్పైసెస్ బోర్డు కార్యాలయం కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ నేతలు రామమందిరంపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాముడి పేరు చెబితే కడుపు నిండుతుందా అని కేటీఆర్ అంటున్నారని, తమకు రాముడే ఆధారమని అన్నారు. మోదీ ప్రభుత్వంలో ముస్లిం, హిందు తేడా లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రియాంబుల్‌ను మార్చి సెక్యూలర్ పదాన్ని ఎలా చేర్చుకుందని ప్రశ్నించారు. మతపరమైన రిజర్వేషన్లను బీజేపీ వ్యతిరేకిస్తుందని అర్వింద్ తెలిపారు. హామీల పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేశారని చెప్పారు.

ప్రజలు మళ్లీ కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారు

• డూప్లికేట్ సెక్యూలర్ నాయకుల మాటలు నమ్మొద్దు
• బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్


మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

సుభాష్‌నగర్, మే11: ప్రజలు మళ్లీ కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమైందన్నారు. డూప్లికేట్ సెక్యూలర్ పార్టీ నాయకులైన జీవన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి మాటలను నమ్మవద్దని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ లేదన్న అర్వింద్ అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్దండులను బీఆర్ఎస్ ఓడించిందని గుర్తుచేశారు. నిజామాబాద్ ఎంపీగా మండవ వెంకటేశ్వరరావును నిలబెట్టే ఆలోచనలో ఉన్న కాంగ్రెస్‌కు ఎంపీ అర్వింద్ డిల్లీకి వెళ్లి కాంగ్రెస్ తరఫున జీవన్‌రెడ్డిని బరిలో నిలబెట్టాడని అన్నారు. రిజర్వేషన్లను రద్దు చేస్తానని అంటున్నాడని అన్నారు. మైనార్టీలు డూప్లికేట్ సెక్యూలర్ లీడర్లకు ఓటు వేయద్దని కోరారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీజేపీ గెలుస్తుందన్నారు. అభివృద్ధి చేసే వారికి ఓటు వేయాలని అర్వింద్ రాముని పాత్రలో ఉన్న రావణుడని, తుక్కు తుక్కుగా ఓడించాలని పిలుపునిచ్చారు.

ప్రజలు ధైర్యంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

● పోలీసు కమీషనర్ కల్మేశ్వర్‌శింగనేవార్



నగరంలో పోలీసుల కవాత పాల్గొన్న సీపీ

ఖిల్లా,మే 11 : ఈనెల 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు మేమున్నామని పోలీసు శాఖ నగరంలో శాంతి కోసం ప్రత్యేక పోలీసు బృందాలతో కవాతు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగానే శనివారం నగరంలోని ఒకటో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఫ్లాగ్‌మార్చ్‌ను పోలీసు కమీషనర్ కల్మేశ్వర్‌శింగనేవార్ పర్యవేక్షించారు. ప్రజలకు ధైర్యాన్ని కలిగించారు. పోలింగ్‌బూత్‌ల ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. ఆయన వెంట నిజామాబాద్ ఏసీపి. రాజవెంకటరెడ్డి, ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాలి

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్



బోధన్‌లో పోలీసుల కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,మే11: ప్రజలు ఎన్నికల నియమ, నిబంధనలను తప్పకుండా పాటించాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలో ప్రధాన వీధుల గుండా పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ప్రత్యేక పోలీసు బలగాలతో పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాలలో కవాతు నిర్వహించి, ప్రజలు ఎటువంటి భయాందోళనకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని, 500మంది పోలీసులతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. పోలీసు భద్రతను మరింత పటిష్టం చేశామన్నారు. ప్రజలు అపరిచిత వ్యక్తులకు తమ ఇళ్లలో ఆశ్రయం కల్పించవద్దన్నారు. లాడ్జ్, హోటల్స్‌లలో గుర్తింపు ఉన్న వారికి మాత్రమే ఆశ్రయం కల్పించాలని, ఎవరిపైన అయిన అనుమానలు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. నేటి నుంచి ఎన్నికల కౌటింగ్ పూర్తయ్యేంత వరకు 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. లాడ్జ్, హోటళ్లలో వ్యక్తుల పేర్లతో రిజిష్టర్‌లలో నమోదు చేయాలన్నారు. నేటి నుంచి మద్యం, కల్లు దుకాణాలు బంద్ ఉంటాయని పేర్కొన్నారు. నివాస ప్రాంతాలు, ఫంక్షన్‌హాల్‌లలో ప్రజలు గుమిగూడి ప్రజలు సమావేశాలు నిర్వహించవద్దని, పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి చర్యలు చేపట్టవద్దన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ వీరయ్య, కోల నరేష్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది మూడో ర్యాండమైజేషన్



ర్యాండమైజేషన్ ప్రక్రియలో పాల్గొన్న కలెక్టర్



హాజరైన పరిశీలకులు

నిజామాబాద్ అర్బన్, మే 11: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలీజ్ వజ్ హర్ సమక్షంలో శనివారం పూర్తి చేశారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసి హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ థర్డ్ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషాలు కూడా ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ ప్రక్రియలో పాల్గొన్నారు.సాధారణ పరిశీలకులు ర్యాండమైజేషన్‌ను నిశితంగా పరిశీలించారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల పరిధిలోగల పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను, ఓపీవోలతో కూడిన బృందాలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు.వీరికి ఇప్పటికే పలువిడతలుగా ఎంపిక చేసిన వివిధకేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్‌చే పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. 20శాతం రిజర్వు సిబ్బంది సైతం అందు బాటులో ఉంటారని ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ప్రతి నియోజకవర్గం పరిధిలో పోలింగ్ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఐదుపోలింగ్ కేంద్రాల చొప్పున మహిళా బృందాలను, ఒక దివ్యాంగుల బృందం, ఒకయువతతో కూడిన పోలింగ్ బృందాలను, ఐదు మోడల్ పోలింగ్ బృందాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. ఈ ప్రక్రియలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమీషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్, ఎన్ఐసి అధికారి రవికుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హసాకొత్తూర్‌లో సమావేశమైన పూర్వవిద్యార్థులు

కమ్మర్‌పల్లి,మే11:మండలంలోని హసాకొత్తూర్ గ్రా మంలో ఉన్నత పాఠశాలలో 2007- 08 విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు శని వారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఈ సం దర్భంగా 17ఏళ్ల తర్వాత పూర్వవిద్యార్థులు సమ్మేళనంలో ఒక్కచోట చేరి గత స్మృతులను గుర్తు చేసుకు న్నారు.అనంతరం తరగతి గదిలో కూర్చొని ఒకరినొకరు ఆప్యాయం గా పలకరించుకొని యోగక్షేమాలు, ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకు న్నారు. తమకు విద్య నేర్పిన గురువులను పూల మాలలు, శాలువలు, మెమోంటోలతో సన్మానించారు. ఈ సమ్మేళనంలో హెచ్‌ఎం డీఎల్ ఎన్.చారి, సాంబశివరావు, గంగాధర్, అరుణశ్రీ, శ్రీనివాసమూర్తి, రంగచారి, మారుతి, విద్యార్థులు పాల్గొన్నారు.

'కార్మిక వ్యతిరేక చట్టాలతో మరణ శాసనం విధించారు'

పెద్దబజార్, మే 11: కార్మిక వ్యతిరేక చట్టాలతో మరణ శాసనం విధించారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. శనివారం నగరంలోని సాయినగర్‌లోగల హనుమంత్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించారని ఆయన న్నారు. ప్రశ్నించే గొంతులపై తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ, శివకుమార్, జన్నారపు రాజేశ్వర్, రాజు, నర్సక్క, మల్లేష్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

13న పోలింగ్‌బూత్‌ల వద్ద ట్రాఫిక్ దారి మళ్లింపు

ఖిల్లా,మే 11 ఈ నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్‌ల వద్ద ట్రాఫిక్ దారి మళ్లింపు చేయడం జరుగుతుందని పోలీసు కమీషనర్ కల్మేశ్వర్‌శింగనేవార్ తెలిపారు. పోలింగ్‌బూత్‌లకు వచ్చే ప్రజలకు (ఓటర్ల)కు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా సంబంధిత పోలింగ్‌గేట్‌ల వద్ద ట్రాఫిక్ దారి మళ్లించడం జరుగుతుందన్నారు. నగరంలో టౌన్-1పోలీసు స్టేషన్ పరిధిలో గల మాలపల్లిమెయిన్‌రోడులో గల ప్రభుత్వ ఉర్దూ మీడియం స్కూల్లో పోలింగ్‌బూత్ ఉన్నందున పోలింగ్‌బూత్‌కు ముందుగానే ఉన్న ఎడమ, కుడి బైలైన్ల ద్వారా ట్రాఫిక్ దారి మళ్లించడం జరుగుతుందన్నారు. టౌన్-2పోలీసు స్టేషన్ పరిధిలో గల గోల్డెన్‌జూబ్లీ స్కూల్లో పోలింగ్ బూత్ ఉన్నందున వాహనాదారులు వేరే ఇతర మార్గాల ద్వారా ప్రయాణించాలన్నారు. టౌన్-3 పోలీసుస్టేషన్ పరిధిలో సీఎస్ఐ కళాశాల/ ఎస్ఎఫ్ఎస్ స్కూల్ /జీజీకళాశాల పరిసర ప్రాంతాలల్లో పోలింగ్‌బూత్‌ఉన్నందున వాహనదారులు వేరే ఇతర మార్గాల ద్వారా ప్రయాణించాలన్నారు. టౌన్-4 పోలీసు స్టేషన్ పరిధిలోని విశ్వశాంతి కళాశాల/ ప్రభుత్వ పాఠశాల పులాంగ్ చౌరస్తాపరిసర ప్రాంతాల్లో పోలింగ్‌బూత్ ఉన్నందున వాహనదారులు వేరే ఇతర మార్గాల ద్వారా ప్రయాణించాలన్నారు. టౌన్-5పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ పీలా స్కూల్ ముజాహిద్ నగర్/క్రీసెంట్ పబ్లిక్ స్కూల్‌ఖిల్లా రోడ్డు పరిసర ప్రాంతాల్లో పోలింగ్‌బూత్‌ఉన్నందున వాహనాదారులు వేరే ఇతర మార్గాల ద్వారా ప్రయాణించాలన్నా రు. టౌన్-6 పోలీసు స్టేషన్ పరిధిలోని ఆటోనగర్‌లోని ప్ర భుత్వం ప్రైమరీస్కూల్ /అర్సపల్లిలోని ఇందూర్ ఐటిఐ/ అర్సపల్లిలోని ప్రభుత్వ హైస్కూల్‌ల్లో పోలింగ్‌బూత్ ఉన్నందున వాహనదారులు వేరే మార్గాల ద్వారా ప్రయాణించాలన్నారు.

● ఆర్మూర్ పట్టణం

ఫతేపూర్‌ఎక్స్‌రోడ్డు పిప్రిగ్రామం /ఖాశీహన్మాన్ ఎక్స్‌రోడ్డు/అశోక్‌నగర్ ఎక్స్‌రోడ్డు నుంచి ధోబీఘాట్ వరకు జిరాయిత్‌నగర్ ఎక్స్‌రోడ్డు ఆర్మూర్ పరిసర ప్రాంతాల్లో పోలింగ్‌బూత్ ఉన్నందున వాహనాదారులు వేరే ఇతర మార్గాల ద్వారా ప్రయాణించాలన్నారు.

● బోధన్ పట్టణం

ప్రభుత్వ జూనియర్ కళాశాల /రేంజల్‌బేస్ లోని నిజామీయాస్కూల్/రాఖాసీపేట్/మధుమలాంచ స్కూల్ పరిసర ప్రాంతాల్లో పోలింగ్‌బూత్ ఉన్నందున వాహనాదారులు వేరే ఇతర మార్గాల ద్వారా ప్రయాణించాలన్నారు.

ఎన్నికల సామగ్రి కోసం ఏర్పాట్లు



ఈవీయంల పంపిణీ కోసం ఏర్పాటు చేసిన దృశ్యం

డిచ్‌పల్లి,మే11: నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్ ఎన్నికల సామగ్రి కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖ అధికారులు సీఎంసీ కళాశాల శనివారం సాయంత్రం ఏర్పాట్లు ముమ్మరం చేశారు. వర్షం సైతంలెక్క చేయకుండా పోలింగ్ కేంద్రంలో ఇబ్బందులు రాకుండా, టేబుళ్లు, కుర్చీలు, టెంట్‌లు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు.ఇప్పటికే సీఎంసీ కళాశా లను పోలీసులు తమ ఆదీనంలోకి తీసుకున్నారు.

ఈదురు గాలులతో రెండిళ్లు ధ్వంసం



గాలి దుమారానికి ఇంటిపై కప్పు లేచిపోయిన దృశ్యం

సిరికొండ మే 11: బలమైన ఈదురు గాలి పెట్టడంతో ఇంటిపై ఉన్న రేకులు కొట్టుక పోవడంతో రెండు కుటుంబాలు నిరాశ్రులయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. సిరికొండ మండలం పాకాల గ్రామలంలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులు రావడంతో గాలి తాకిడికి ఇంటి పైన ఉన్న రేకులు కొట్టుక పోయాయి. దీని వల్ల బాదవత్ వాల్య, బాదవత్ సుభాష్ కుటుంబాలకు నిలువ నీడ లేకుండా పోయింది. ఆ ఇంటిలో రెండు కుటుంబాలు సుమారు పది మంది వరకు ఉంటారని గ్రామస్థులు తెలిపారు. ఉండడానికి ఇళ్లు లేక ప్రస్తుతం ఇతరుల ఇంటిలో ఆశ్రయం పొందుతున్నారు.ఆర్థిక పరిస్థితి బాగా లేక పోవడంతో బతుకు దెరువు కోసం ఇంటి యజమాని వాళ్లు హైదరాబాద్‌లో కూలీపని చేసుకుంటు జీవిస్తున్నారు. గ్రామంలో కూడ తమ పరిస్థితి ఏ మాత్రం బాగా లేదని వారు చెపుతున్నారు.కూలీ నాలి చేసుకుంటు జీవనం సాగిస్తున్నట్లు వాళ్ల కుటుంబ సభ్యులు చెప్పారు.పేదరికంలో ఉన్న మా కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరుతున్నారు.వారి కుటుంబా సభ్యుడు సుభాష్ అనే వారు అరబ్ దేశంలో పని చేస్తు జీవనం సాగిస్తున్నాడని చెప్పారు. నివాసం గృహం నిర్మించుకోవడానికి ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని వారు, సుభాష్ కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఆర్థిక పరిస్థితి బాగాలేనందున ముందుకు వచ్చి ప్రస్తుతం ఉండడానికి వీలుగా రేకులు వేసుకోవడానికి దాతలు ముందుకు వచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని వారు విషన్నవదనాలతో కోరుతున్నారు.



రేకులు ఇంటికి దూరంగా పడిపోయిన దృశ్యం

పాత డిజైన్ ప్రకారమే ప్రాజెక్టు నిర్మిస్తాం

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మోపాల్,మే 11: ఈనెల 13న జరుగబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి కోరారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని మంచిప్ప ఉపాధిహామీ పనులు చేస్తున్నకూలీల వద్ద వెళ్లి ఎమ్మెల్యే ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రీడిజైన్ పేరుతో మంచిప్ప ప్రాజెక్టును నిర్మిస్తామని ఈ ప్రాంత ప్రజ లను భయభ్రాంతులకు గురి చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటిచ్చిన ప్రకారం పాత డిజైన్ ప్రకారమే ప్రాజెక్టు నిర్మిస్తామని అన్నారు. ప్రజలందరు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని కోరారు. ఎమ్మెల్యే వెంట నాయకులు ముప్పాగంగారెడ్డి, చంద్రశేఖర్ గౌడ్, సాయరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సతీష్ రెడ్డి, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

● కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

మండంలోని చిన్నాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

టీఎస్ ఆర్టీసీ సంస్థ ఉన్నతాధికారులపై జీవన్‌రెడ్డి అసత్య ఆరోపణలు

● హైకోర్టు ఆదేశాల ప్రకారమే ఆర్టీసీ సంస్థ నడుచుకుంటుంది
● క్రమం తప్పకుండా జీఎస్టీని కేంద్రానికి చెల్లిస్తున్నాం
● టీఎస్ ఆర్టీసీ యాజమాన్యం

సుభాష్‌నగర్, మే 11: టీఎస్ ఆర్టీసీ సంస్థ ఉన్నతాధికారులపై ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఈ ఆరోపణలు సంస్థ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం సంస్థ నడుచుకుంటుందని అన్నారు. ఆర్మూర్‌లోని జీవన్‌మాల్‌కు సంబంధించిన అద్దె బకాయిలు పెండింగ్‌లో ఉన్నందునే నోటీసులు జారీ చేసి మైకులో అనౌన్స్ చేయడం జరిగిందన్నారు. బకాయిలు చెల్లించాలని గత ఐదు సంవత్సరాలుగా 20కి పైగా నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. ఎలాంటి నోటీసులు జారీ చేయలేదని ఆరోపించడంలో ఏమాత్రం నిజం లేదన్నారు. జీఎస్టీ కేంద్రానికి చెల్లించడం లేదనడం పూర్తిగా అర్ధరహితమన్నారు. నిబంధనల ప్రకారమే క్రమం తప్పకుండా జీఎస్టీని సంస్థ చెల్లిస్తుందన్నారు. బకాయిల విషయంలో సంస్థ ఏమాత్రం రాజీ పడటం లేదని నిబంధనల మేరకే డబ్బులను వసూలు చేయడం జరుగుతుందన్నారు. ఒప్పందం ప్రకారం డబ్బులు చెల్లించకుండా ఉద్దేశపూర్వకంగా సంసపై ఉన్నతాధికారులపై వ్యక్తిగతంగా ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.275	రూ. 295

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73,100	రూ.67,400	రూ.860

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (10.30)
: కృష్ణమ్మ (1.40, 7.45, 10.40)
: బాక్ (4.35)
స్క్రీన్-2 : కృష్ణమ్మ (10.20)
: ప్రతినిధి-2 (1.15)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (4.10)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (ఇంగ్లీష్) (7.20, 10.30)
స్క్రీన్-3 : శ్రీకాంత్ (హిందీ) (10.25, 1.25, 7.20, 10.20)
: ఆ ఒక్కటి అడక్కు (4.25)
స్క్రీన్-4 : ప్రతినిధి-2 (10.40, 7.35, 10.30)
: ఆరంభం (1.35)
: ప్రసన్నవదనం (4.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ప్రతినిధి-2 (10.45, 430, 10.30)
: కృష్ణమ్మ (1.35)
: ఆ ఒక్కటి అడక్కు (7.30)
స్క్రీన్-2 : ఆ ఒక్కటి అడక్కు (1.40)
: బాక్ (4.30)
: కృష్ణమ్మ (7.30, 10.30)
స్క్రీన్-3 : కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (ఇంగ్లీష్) (10.50)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (1.45, 4.40, 7.30, 10.30)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15)
: ఆ ఒక్కటి అడక్కు (6.15, 9.15)
లలితమహాల్ : ప్రతినిధి-2 (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (11.15, 2.15, 6.15 9.15)
విజయ్ : కృష్ణమ్మ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్









